ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 04.11.2024 సమయం : 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచేందుకు సమాజం , ప్రజా ప్రతినిధులు , తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

2. రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు.

3. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా రాష్ట్రంలో బీసీ కులగణనకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

4. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన అస్తవ్యస్తంగా కొనసాగుతోందని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు.

**KISHAN REDDY - SCHOOLS**

ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరిచేందుకు సమాజం , ప్రజా ప్రతినిధులు , తల్లిదండ్రులు తోడ్పాటు అందించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ సీతాఫల్ మండి ప్రభుత్వ పాఠశాల , జామే ఉస్మానియా ప్రభుత్వ పాఠశాలల్లో మంత్రి ఈ ఉదయం పాఠశాలకు, మురుగుదొడ్లు పరిశుభ్రం చేసే పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్ని పటిష్టం చేసుకోవాలని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. పాఠశాలలకు అవసరం అయిన మరిన్ని సదుపాయాలను కల్పించేందుకు కూడా మంత్రి సంసిద్ధత వ్యక్తం చేశారు. తల్లి దండ్రులు కూడా తమ పిల్లల పురోగతిని ఎప్పటికప్పుడు పట్టించుకుంటూ , టీచర్లతో సమన్వయంతో

వ్యవహరించాలని మంత్రి సూచించారు. ఫర్నిచర్ , టాయిలెట్ క్లీనింగ్ పరికరాలను అటల్ బిహారీ వాజ్ పేయ్ ట్రస్టు, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థలు సమకూర్చాయి.

(MSL)

**EARLY - KISHAN REDDY:**

అనంతరం BJP పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెసు పార్టీ ఎన్నికల హామీలకు, అమలు చేస్తున్న నిర్ణయాలకు పొంతన లేదని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి G కిషన్ రెడ్డి ఆరోపించారు. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో కాంగ్రెసు ప్రభుత్వాలు విఫలమయ్యాయని , గతంలో అమలవుతున్న పథకాలనూ కొనసాగించలేని పరిస్థితి ఆయా రాష్ట్రాలలో ఉందని ఆరోపించారు. వంద రోజుల్లో పూర్తి చేస్తామన్న హామీలను , ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది కావస్తున్నా , అమలుతీరుపై కాంగ్రెసు పార్టీ స్పష్టత ఇవ్వ లేకపోయిందనీ ఆరోపించారు.

----- MSL

**PONGULETI SRINIVAS REDDY**

రాష్ట్రంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. ఈరోజు ఖమ్మంలో మంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా పాలనలో ఆరు గ్యారంటీల అమలుకు స్మార్ట్ కార్డు సంజీవనిలా పనిచేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని వాగ్దానాలను అమలు చేసి తీరతామన్నారు. గత ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 2 లక్షల మంది రైతులకు 2 లక్షల రూపాయల లోపు రుణ మాఫీ చేశామని చెప్పారు. వచ్చే డిసెంబర్ లోగా మిగతా రుణమాఫీ కూడా పూర్తిచేస్తామన్నారు.

(పిటీసీ, ఖమ్మం)

## CM – DEDICATION COMMISSION

రాష్ట్రంలో బీసీ కులగణనకు  ప్రత్యేక కమిషన్  ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హై కోర్టు తీర్పుకు అనుగుణంగా  ఈ కమిషన్ ఉండాలని సూచించారు. బీసీ కులగణనపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని , ఈ విషయంలో ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని  మంత్రుల, అధికారులతో జరిపిన సమావేశంలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. బీసీ సామాజిక , ఆర్థిక, కుల సర్వే కోసం ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ నియమించాలని నిర్ణయించిన నేపథ్యంలో వెనుకబడిన తరగతుల కమిషన్ నిర్వహిస్తున్న బహిరంగ విచారణ కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. ఇప్పటికే బీసీ కమిషన్‌కు కుల సర్వే చేసేందుకు ప్రత్యేక కమిషన్‌గా ప్రభుత్వం ఉత్తర్వులివ్వగా.. బీసీ కులగణన సర్వే బాధ్యత కూడా కమిషన్ తీసుకొంది.

(డెస్క్)

## DAMODARA RAJANARASIHMA

మెదక్ జిల్లా నర్సాపూర్ ఏరియా ఆసుపత్రిలో  5 పడకల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన డయాలసిస్  సెంటర్ ను వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. దాదాపు 50 లక్షల రూపాయల వ్యయంతో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేశామన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యల చేపడుతుందన్నారు. కార్యక్రమంలో  నర్సాపూర్ శాసనసభ్యులు సునీత లక్ష్మారెడ్డి , మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

(పిటీసీ - మెదక్)

## FORMER SARPANCHES

పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచులు ఈరోజు ఛలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చారు. తమ సమస్యలపై ముఖ్యమంత్రి  రేవంత్ రెడ్డి కి  వినతి పత్రం ఇవ్వనున్నామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు.

హైదరాబాద్ లో సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ , రాష్ట్ర ఉపాధ్యాక్షులు గుండి మధుసూదన్ రెడ్డి తో పాటు పలువురు మాజీ సర్పంచులను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.
(డెస్క్)

**HMDA CLARIFICATION**

HMDA పరిధిలోని గ్రామ పంచాయతీల్లో అనధికారిక లే అవుట్లలో ప్లాట్ల రిజిస్ట్రేషన్ లను నిషేధించినట్లు జరుగుతున్న ప్రచారాన్ని ఆ సంస్థ ఖండించింది. దీనికి సంబంధించి గత ఏడాది కాలంగా తాము రిజిస్ట్రేషన్ – స్టాంపుల శాఖకు ఎలాంటి అభ్యర్ధనను పంపలేదని తెలిపింది. పంచాయతీల్లో అనధికారిక లే అవుట్ల ప్లాట్ల రిజిస్ట్రేషన్ లను నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని స్పష్టం చేసింది.
(ప్రెస్ నోట్)

**VANI PRASAD**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణి ప్రసాద్ కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నుండి విజయవాడ వెళ్తుండగా సూర్యాపేట జిల్లా ఆకుపాముల వద్ద ఎదురుగా వస్తున్న కారును డీ కొట్టడంతో వాణి ప్రసాద్ ప్రయాణిస్తున్న కారు పొలాల్లోకి దూసుకెళ్ళింది. కోదాడ ఆర్డిఓ సూర్యనారాయణ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని గాయాలతో బయటపడిన ప్రిన్సిపాల్ సెక్రెటరీ వాణి ప్రసాద్ ను ప్రథమ చికిత్స కోసం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
పిటిసి, సూర్యాపేట

**SADAR FESTIVAL**

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో సదర్ సమ్మేళన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సదర్ ఉత్సవ కమిటి చైర్మన్ శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చిన్న శ్రీశైలం యాదవ్ హాజరైయ్యారు. కోదాడలో మొదటిసారి నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి యాదవ సోదరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. యువకులు దున్నపోతులతో ఊరేగింపు నిర్వహించి , ఆటపాటలతో సదర్ ఉత్సవాలను జరుపుకున్నారు.

(పిటీసీ - సూర్యాపేట)

**QR CODE**

చారిత్రక కట్టడాల వివరాలు ప్రజలకు తెలిసేలా కేంద్ర పురావస్తుశాఖ ఆయా నిర్మాణాల వద్ద క్యూ ఆర్ కోడ్ లను ఏర్పాటు చేస్తుంది. వరంగల్ జిల్లా ఖిలా వరంగల్ లోనూ వీటిని అందుబాటులోకి తెచ్చింది. ఈ కోడ్ ను ఫోన్ లో స్కాన్ చేస్తే తెలుగు , హిందీ, ఇంగ్లీష్ లో కాకతీయుల చరిత్ర, ఆలయాల విశేషాలు, పురాతన కట్టడాల వివరాలు అందుతాయి. జిల్లా పర్యాటక ప్రాంతాల వివరాలు , గూగుల్ మ్యాప్ లొకేషన్ వంటివి తెలుసుకొనేందుకు వెసులుబాటు ఉంది.

(డెస్క్)

**BANDI SANJAY**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అస్తవ్యస్త పాలనను కొనసాగిస్తోందని కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. 'ఓవర్సీస్ ఫ్రెండ్స్ ఆఫ్ బీజేపీ " అసోసియేషన్ కు చెందిన ఎన్నారైలతో 'జూమ్' ద్వారా కేంద్ర మంత్రి సంభాషించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయడం చేతగాక హైడ్రా , మూసీ, కుల గణన పేరుతో రోజుకో అంశాన్ని తెరపైకి తెస్తూ డైవర్షన్ రాజకీయాలు చేస్తోందని వివరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపుతున్నాయని , దేవాలయాలపైన, హిందూ ధర్మంపైన దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

(పిటీసీ కరీంనగర్)

**MLA HARIBABU**

ఆసిఫాబాద్  జిల్లా సిర్పూర్ రేంజ్ పరిధిలో అడవి పంది వేటలో ఏడుగురు గిరిజనులను అదుపులోకి తీసుకొని , చితక బాదిన అటవీ అధికారుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సిర్పూర్ ఫారెస్టు రేంజ్ ఆఫీసు ఎదుట నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సిర్పూర్ రేంజర్, సెక్షన్ ఆఫీసర్ ను వెంటనే సస్పెండ్ చేయాలని , వారికి అండగా నిలుస్తున్న డీఎఫ్ఓ అటవీ శాఖ అధికారిని బదిలీ చేయాలని డిమాండ్ చేశారు.

(పిటీసీ, అసిఫాబాద్)

**KARTHIKA MASAM**

కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా రాష్ట్రంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఓం నమశ్శివాయ అనే పంచాక్షరీ మంత్రంతో ఆలయాలు మారుమ్రోగాయి. అర్చకులు శివునికి ప్రత్యేక రుద్రాభిషేకాలు , మహా రుద్రాభిషేకాలు , బిల్వార్చనలు నిర్వహించారు. పంచామృతాలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేశారు. శైవ క్షేత్రాల్లో భక్తులు అధిక సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి గోపూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. భద్రాచలం వద్ద భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి నదిలో కార్తీక దీపాలు వదిలారు. హైదరాబాద్‌లోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

(డెస్క్)

**SINGER SALWAJI SANDHYA FIVE RECORDS**

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన గాయని సల్వాజి సంధ్య స్థానిక కలెక్టర్ ఆడిటోరియంలో 6 గంటల పాటు 72 పాటలు పాడి ఐదు ప్రపంచ రికార్డులను సొంతం చేసుకున్నారు. సల్వాజి

ప్రవీణ్ మ్యూజికల్ గ్రూప్ ఆధ్వర్యంలో నిన్న ఉదయం 10 గంటలకు పాటల కార్యక్రమాన్ని ప్రారంభించి సాయంత్రం 4 గంటలకు ముగించారు. ప్రపంచ రికార్డు కోసం ఆమె ప్రముఖ గాయని కేఎస్ చిత్ర పాడిన పాటలు పాడారు.
(పిటీసీ కరీంనగర్)

**VIGILANCE AWARENESS WEEK**

విజిలెన్స్ అవెర్నెస్ వారోత్స వాల్లో భాగంగా గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆధ్వర్యంలో నల్గొండ పట్టణంలో ఉద్యోగులు ర్యాలీ నిర్వహిం చారు. ఇందులో బ్యాంక్ రీజినల్ మేనేజర్ విజయ్ భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు. ప్రతి ఒక్కరు పారదర్శకత , సమగ్రత, అవినీతిని నిర్మూలించేందుకు పనిచేయాలని ఈ సందర్భంగా బ్యాంక్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ప్రజా పరిపాలనలో సమగ్రత , పారదర్శకత పట్ల నిబద్ధతతో ముందుకు సాగాలన్నారు. అవినీతిని ఎదు ర్కోవడానికి, నైతిక పద్ధతులను ప్రోత్సహిస్తామని ప్రతిజ్ఞ చేశారు.
(పిటీసీ -నల్గొండ)

**TS RAINS**

తెలంగాణలోని పలు జిల్లాల్లో ఈరోజు ఉరుములు , మెరుపులతో కూడిన వర్షాలు కరుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, మహబూబ్ నగర్ , నాగర్ కర్నూల్ , వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మిగతా చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది.
(డెస్క్)